ప్రజాశక్తి

సోమవారం 1జనవరి 2024

5

అల్లూరి సీతారామరాజు



ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- పాడేరు: 2024 ప్రజాశక్తి వార్షిక కేలండర్‌ను ఆదివారం స్థానిక ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం లో ఆలయ ధర్మకర్త ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు, గిరిజన సంక్షేమ (విద్య) శాఖ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు ఎస్ పూర్ణచంద్రరావు, జివివి ప్రసాద్ మాస్టారు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వూడా త్రినాధరావు ఆవిష్కరించారు. ప్రతి ఏటా ప్రజాశక్తి ముద్రిస్తున్న వార్షిక కేలండర్ ఒక ప్రత్యేక ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారని కితాబిచ్చారు. పాఠకులు, ఉద్యోగ, వ్యాపార, కార్మిక వర్గాల ఆదరాభిమానాలను ప్రజాశక్తి కేలెండర్ చూరగొంటుందని అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా ప్రజా కేలండర్ రూపొందిస్తుండడం అభినందనీయమని కొనియాడారు.

ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ దేవుడు బాబు మాట్లాడుతూ ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ప్రారంభం నుంచి ఏటా వార్షిక క్యాలెండర్‌ను ముద్రిస్తోందన్నారు. పాఠకులకు ఉచితంగా అందిస్తున్న ఈ కేలండర్ ముద్రణ వ్యయం ఎంతో పెరిగినప్పటికి, క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం సంస్థ ముద్రిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామం ఆలయ కమిటీ నాయకులు కె రామారావు, వి వెంకటరత్నం, శివరాత్రి శ్రీనివాస్ కుమార్ ముకుందరావు కే పోతురాజు, దాసరి నాగు, రమేష్ నాయుడు ఆధ్యాత్మిక సేవా సభ్యులు పాల్గొన్నారు.

వినూత్న నిరసనల జోరు



కొయ్యూరులో కోలాటమాడుతున్న అంగన్వాడీలు

- 20వ రోజుకు అంగన్వాడీల సమ్మె
- హుకుంపేటలో చేతులెక్కి మొక్కులు
- పలుచోట్ల ఆటాపాటలతో నిరసన
- వైఎస్ఆర్‌కు వినతిపత్రాల అందజేత



హుకుంపేటలో చేతులెత్తి దండాలు పెడుతూ మోకాళ్లపై అంగన్వాడీల నిరసన

అంగన్వాడీల సమ్మె 20వరోజుకు చేరిన సందర్భంగా ఆదివారం వినూత్న నిరసనలతో ఆందోళనను ఉధృతం చేశారు. కొత్త సంవత్సరంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 3న కలెక్టరేట్ ముట్టడితోపాటు, సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. రంపచోడవరం డివిజన్‌లో ఆటపాటలతో అంగన్వాడీలు నిరసన చేపట్టారు.

(ప్రజాశక్తి విలేకర్లయంత్రాంగం)

హుకుంపేట: అంగన్వాడీల సమ్మె 20వ రోజును హుకుంపేటలో అంగన్వాడీలు వినూత్న నిరసన చేపట్టారు. మోకాలుపై నిల్చుని, చేతులెత్తి దండం పెడుతూ, ముఖ్యమంత్రి జగన్ తమ మొరనాలించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకులు టి.కృష్ణవేణి, అప్పలకొండమ్మ, సిఐటియు మండల కార్యదర్శి టి.అప్పలకొండ పడాల్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామని మాటిచ్చిన ముఖ్యమంత్రి జగన్, తాము 20రోజులుగా రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా తనకేమీ పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమని, ఇప్పటికైనా ఇచ్చిన హామీని గుర్తుకు తెచ్చుకుని తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేతులెత్తి దండం పెడుతూ వేడుకున్నారు. తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకుంటే, చేతులెత్తి మొక్కుకున్న తాము, సత్తా చూపించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు భాగ్య, పద్మ, పూర్ణిమ, లక్ష్మి, ఈశ్వరమ్మ, వసంత, పుష్ప, కృష్ణకుమారి, రాధిక పాల్గొన్నారు..

పెదబయలు : నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు మండిపడ్డారు. చర్చల పేరుతో రాష్ట్ర మంత్రి వర్గ ఉప సంఘం అంగన్వాడీ యూనియన్ నేతలను నాలుగైదు సార్లు పిలిచి, ఆమోదయోగ్యంగా సమ్మె పరిష్కారానికి చర్యలు చేపట్టకుండా సమ్మెను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తామంటూ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం మొండివైఖరివీడి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 3న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, దిగ్బంధన ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెదబయలు మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరికి వ్యతిరేకంగా అంగన్వాడీలు ఆటపాట, కబడ్డీ పోటీలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మాన పడాల్, సిఐటియు మండల నాయకులు సిహెచ్ రామారావు, గిరిజన సంఘం నాయకులు సునీల్‌కుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మంగమ్మ, కొండమ్మ, వరహాలమ్మ, భవాని, సరస్వతి, పద్మ పాల్గొన్నారు



విఆర్.పురంలో వైఎస్ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అనంతగిరి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 20రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు వినూత్న నిరసనలు కొనసాగిస్తున్నారు. అనంతగిరిలో ఆదివారం ఖాళీ పల్లేలను మోగిస్తూ వినూత్నంగా ఆందోళన చేశారు. అంగన్వాడీల సమ్మెకు పలు ఉద్యోగ, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. సోమవారం కొత్త సంవత్సరం వేడుకలను సమ్మె శిబిరంలోనే జరుపుకోవాలని నిర్ణయించారు.

ఆట పాటలతో నిరసనలు

విఆర్.పురం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు రహదారిపై ఆదివారం కోలాటం, నృత్యాలు చేసి నిరసన తెలిపారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూనం సత్యనారాయణ, యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, నాగమణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు 20వ రోజు కోలాటం, గిరిజన సాంస్కృతిక నృత్యం థింసా ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్ సూరిబాబు, యూనియన్ నాయకులు ముత్యాలమ్మ, అచ్చిమ్మ, పూర్ణ పాల్గొన్నారు.


మానవహారం

రాజవొమ్మంగి : అంగన్వాడీలు స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద రహదారిపై ఆదివారం మానవహారం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తొలిత అంగన్వాడీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీలు రహదారిపై కోలాటం, థింసా నృత్యాలు చేశారు. దీంతో రహదారిపై వాహనాలు చాలా సేపు నిలిచిపోయాయి. అంగన్వాడీల పోరాటానికి గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, సీపీఎం నాయకులు జర్తా రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, ఎల్ సత్యవతి, నూకరత్నం, కె లక్ష్మి, చిన్నమ్మలు, రమణి, రమణ, రత్నం, రాజేశ్వరి, మంగ, రాధ, ఎర్రయ్యమ్మ పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం దారకొండ వారపు సంతలో అంగన్వాడి వర్కర్లు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వీరికి సిపిఐ నాయకులు సుంకర విష్ణుమూర్తి, టిడిపి మాజీ ఎంపీటీసీ పోతురాజు గోవిందు, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర, మాజీ సర్పంచ్ అల్లంకి రాజు మద్దతు తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి అంగన్వాడి వర్కర్ల డిమాండ్లు నెరవేర్చకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయా పార్టీల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



సీలేరులో మానవహారం



అనంతగిరిలో ఖాళీ పళ్లేలు మోగిస్తూ నిరసన



రాజవొమ్మంగిలో మానవహారం



పెదబయలులో మాట్లాడుతున్న సన్నిబాబు

విద్య, ఉద్యోగాలకు పోరాటం

- ఘనంగా ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -పాడేరు: విద్య, ఉద్యోగ సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిరంతరం పోరాటం చేస్తోందని ఎస్ఎఫ్ఐ నేతలు వెల్లడించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను అల్లూరి జిల్లా ఉపాధ్యక్షులు పి.చిన్నారావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, 1970 డిసెంబర్ 30,31 తేదీల్లో కేరళలో అధ్యయనం, పోరాటం నినాదంతో ఆవిర్భవించి, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో 53ఏళ్లుగా ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు, ఉద్యమాలను నిర్వహిస్తోందన్నారు. ఆశయసాధనలో ఎందరో విద్యార్థులు తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారన్నారు.ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల్లో ప్రజా సహకారంతో ఎస్ఎఫ్ఐ పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.



ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరిస్తున్న చిన్నారావు

విద్యావ్యవస్థలో మతతత్వాన్ని తీసుకొచ్చి, పేద విద్యార్థులకు గుదిబండలా ఉన్న జాతీయ నూతన విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఈ విధానం రద్దుకు ఈనెల 12న చలో ఢిల్లీఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ 53 ఏళ్ల త్యాగాలను స్మరించుకుంటూ,అల్లూరి జిల్లాలో విద్యార్థుల సమస్యలపై మరింతగా పోరాడేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. అల్లూరి జిల్లాలో ప్రభుత్వ బిఇడి, పిజి కాలేజీ ఏర్పాటు, జిఒ 77రద్దుకు పోరాటం కొనసాగిస్తామన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో, కళాశాలలో హెల్త్ వాలంటరీలను నియమించి, విద్యార్థుల మరణాలను నివారించాలని డిమాండ్ చేశారు. విద్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న నాడు నేడు పనులు సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి సింహాద్రి,ఎస్ మత్యరాజు,పి.వరహాలు, పి రమణ, అచ్చిబాబు విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం డౌనూరు పంచాయతీ రొబ్బసింగి గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం మన ఆరోగ్యం మన చేతుల్లో అనే కార్యక్రమం నిర్వహించి ఆరోగ్యం పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లలకు పసర మందులు పట్టకూడదని, నాటు వైద్యం సరికాదని, వేడి చేసిన నీళు తాగాలని, దోమలు తెరలు వాడాలని సూచించారు. అనంతరం దాతలు సహకారంతో గ్రామస్తులకు దుస్తులు, యువతకు వాలీబాల్ కిట్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు టి.మల్లేష్, సంస్థ ప్రతినిధులు తిరుపతి బాబు, లక్ష్మణ్, చిట్టిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుండి దేవరపల్లిలో ఆధార్ సేవలు

ప్రజాశక్తి -సీలేరు

గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి సచివాలయ కేంద్రంలో మంగళవారం నుండి ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని సచివాలయ కార్యదర్శి సీదరి వెంకటేశ్వర్లు తెలిపారు. పెదవలస, లకవరపు పేట, దేవరపల్లి పంచాయతీ పరిధిలో ప్రజలు ఈ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, ఫోన్ నెంబర్ లింక్, నూతన ఆధార్ కార్డు వంటి సేవలను పొందవచ్చునని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం

రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. 39 మందికి రక్త పరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఫిజియథెరపీ చేశారు. రోగులకు, సహాయకులు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లు గాధిరాజు వెంకటలక్ష్మి, దుళ్ళపల్లి కృష్ణ కిషోర్, దుళ్లపల్లి సరళ పాల్గొన్నారు.



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

స్కూల్ శానిటేషన్ కార్మికులకు

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లుగా పని చేస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం సక్రమంగా, సకాలంలో జీతాలు చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటుందని విమర్శించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రాంగణంలో ఆదివారం జరిగిన శానిటేషన్ కార్మికుల సమావేశంలో వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అనారోగ్యానికి గురికాకుండా పాఠశాల ఆవరణను, మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న శానిటేషన్ కార్మికుల పట్ల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్మికులకు శానిటేషన్ పరికరాలను కూడా పంపిణీ చేయడం లేదన్నారు. నెలకు రూ.6000 జీతం ఇవ్వాల్సి ఉండగా, రూ.3000, రూ.4000 మాత్రమే వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, శానిటేషన్ పరికరాలు పంపిణీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున్న స్కూల్ పారిశుధ్య కార్మికులు

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం శానిటేషన్ కార్మికుల సంఘం మండల కమిటీని 25 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సుబ్బమ్మ, కార్యదర్శిగా జయలక్ష్మి, కోశాధికారిగా సురేష్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, రంగమ్మ, సుబ్బలక్ష్మి, జయ, సుజాత, సురేష్, దేవి, మార్కమ్మ, రాజమ్మ, సత్తెమ్మ, శైలజ, రోహిణి, కమల, అరుణ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిఎం జన్‌మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కూటూరు పంచాయితీ పరిధి కొండరెడ్డి గ్రామలైన గబ్బిలాల గొంది, కారుమాను కోట గ్రామాల్లో ప్రధాన మంత్రి జన్ మన్ పథకంపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ అధికారులు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కొండరెడ్డి ఆవాసాలకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ సభ ద్వారా ఆధార్ కార్డు లేని వ్యక్తులు 22 మంది, బ్యాంకు అకౌంట్ లేని వ్యక్తులు 32 మందిని, జాబ్ కార్డు లేనివి 13, బర్త్ సర్టిఫికెట్ 14, ఆరోగ్య శ్రీ కార్డులేని వ్యక్తులు ఒకరు ఉన్నట్లు గుర్తించామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి బ్రమ్మయ్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని పివిటిజి కొండరెడ్లు ఉన్న నివసిస్తున్న తుమ్మిలేరు గ్రామ పంచాయతీలోని కొల్లూరు, గొందురు, కొండేపూడి, తుమ్మిలేరు, పోచవరం గ్రామాలలో ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. పిఎం జన్ మన్ పథకంలోని 11 కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి పూర్తి అవగాహన కల్పించడం జరిగింది. అవసరమైన వారికి ధ్రువీకరణ పత్రాలు అక్కడే అందించడం జరిగింది. ఇందులో భాగంగా లేట్ బర్త్ సర్టిఫికెట్ -7, ఉజ్వల గ్యాస్ అప్లికేషన్స్-5, రైస్‌కార్డ్స్ స్ప్లిట్టింగ్ -8, కొత్త ఉపాధి కార్డులు -8, కొత్త బ్యాంకు అకౌంట్లు -10, మొత్తం - 38 సర్టిఫికెట్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అందెలా సీత రామిరెడ్డి, ఎంపీడీఓ ఫణీంద్ర రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ పుల్లయ్య, జీడిగుప్ప పీహెచ్‌సి డాక్టర్, ఈ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ ఏపీఎం కిరణ్, ఇఒపిఆర్‌డి పి.వెంకటేశ్వర్లు, జీడిగుప్ప సచివాలయ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, కొండరెడ్డి తెగకు చెందిన గిరిజనులు



వ్యాన్‌పై సిమెంట్ రేకులు, ఇనుము తీసుకొచ్చిన జమాల్ ఖాన్ తదితరులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి- విఆర్ పురం

మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీ పరిధి సీతంపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ముత్యాల వెంకటేశ్వర్లు ఇల్లు అగ్నికి ఆహుతి కాగా, ఆయన కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఇంటి నిర్మాణ సామ్రగిని వితరణ చేసింది. అగ్ని ప్రమాదంలో వెంకటేశ్వర్లు ఇల్లుతో పాటు ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర గృహోపకరణాలు కాలి బూడిదై కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురైన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఇటీవల ఆయుర్వేద ప్రముఖ వైద్యులు జమాల్ ఖాన్ సందర్శించి, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ట్రస్ట్ ద్వారా బాధిత కుటుంబానికి ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ.32వేలు విలువైన సిమెంట్ రేకులు, ఇనుప పైపులను అందించారు. వరదల ముంపు సమయంలోనూ జమాల్‌ఖాన్ ట్రస్టు తరుపున బాధితులను ఆదుకున్న విషయాలను గ్రామస్తులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఇన్చార్జ్ సుభాని, విఆర్ పురం గ్రామ పెద్దలు సరఫరాజ్, సీతంపేట గ్రామ పెద్దలు బుర్ర రాంబాబు, పొత్తుల నారాయణ, ముత్యాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. గురుకుల పాఠశాల నుండి సబితా, దివ్యభారతి, సమీరారెడ్డి, సంధ్యారాణి, సత్య, శివదుర్గ, ప్రసన్న, హేమలలిత, దేవాంజలి మంచి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పర్యాటక కేంద్రాలకు కొత్త సంవత్సర శోభ



గిరిజన మ్యూజియంలో అలరించిన థింసా నృత్యాలు

- గిరిజన మ్యూజియంలో సంప్రదాయ నృత్యాల సందడి
- పోటెత్తిన సందర్శకులతో పర్యాటక ప్రాంతాలు కిటకిట
- వాహనరద్దీతో ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జాంతో అవస్థలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ గిరిజన మ్యూజియం ప్రాంగణంలో మర్రి కామయ్య సాంస్కృతిక కళావేదికపై పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతిస్తూ న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు మిన్నంటాయి. చొంపి బృందం థింసా నృత్యం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా అరకులోయ పర్యటక కేంద్రాలు అందాలను తిలకించేందుకు వివిధ దేశ విదేశాల నుంచి వస్తున్న సందర్శకులను రాగా, పర్యాటకుల సౌకర్యార్థం పలు కళారూపాల ప్రదర్శనలు నిర్వహించారు. వీటిని పర్యాటకులు, స్థానికులు భారీగా తరలి వచ్చి సందడి చేశారు. ఇటువంటి ప్రదర్శనలు నిర్వహించడంతో మరింత జోష్, పెరిగిందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి : మన్యంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. ఆదివారం, నూతన సంవత్సరం కలిసిరావడంతో పర్యాటక అందాలను తిలకించేందుకు వేలాదిమంది పర్యాటకులు తరలిరావడంతో అనంతగిరి మండలంలో జనసందోహం నెలకొంది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు తిలకించేందుకు, అలాగే న్యూ ఇయర్ వేడుకలు జరుపుకునేందుకు స్వదేశీ, విదేశీ పర్యాటకులు పోటెత్తారు. డముకు వ్యూపాయింట్, కటికి, తాడిగుడ జలపాతాల సందర్శనకు వచ్చిన పర్యాటకులు అక్కడ కేరింతలు కొడుతూ, సెల్ఫీలతో సందడి చేశారు. అరకు పర్యటించే ముందు మర్రగుడ, చాపరాయి కాఫీ ప్లాంటేషన్‌లను సందర్శించి, తోటల్లో కాఫీతాగుతూ, సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అక్కడ నుంచి సుంకరమెట్ట వ్యూపాయింట్ మీదుగా అరకు తరలిపోయారు. పెద్దఎత్తున సందర్శకులు రావడంలో ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ జామ్ నెలకొంది. అనంతగిరి, అరకు మార్గంలో ఘాట్‌రోడ్డులో గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న పర్యాటకులు

నిరుద్యోగులను పక్కదారి పట్టించేందుకే..


మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

- ఆడుదాం ఆంధ్రాపై ఆదివాసీ గిరిజన సంఘం ధ్వజం
- జనవరిలో జాబ్ కేలండర్ హామీ అమలు చేయాలి
- 2.40 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి
- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి వెంటనే ప్రకటించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయ/ రూరల్ : ఎన్నికల సంవత్సరంలో ఉద్యోగాల భర్తీ, జనవరిలో జాబ్ కేలండర్ జారీపై సిఎం జగన్, వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నిరుద్యోగ యువత ఆందోళనబాట పట్టకుండా, వారిని పక్కదారి పట్టించేందుకే 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలంటూ హడావిడి చేస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పి బాలదేవ్ మండిపడ్డారు. ఆదివారం స్థానిక గిరిజన సంఘం భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి బుజ్జిబాబుతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 40 వేల ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు నియామకాలు చేపట్టకుండా యువత భవిష్యత్తుతో ఆడుదాం ఆంధ్ర అంటూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆటాడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ కేలండర్‌పై అసంతృప్తితో రగిలిపోతున్న నిరుద్యోగులను ఎన్నికల వరకు దృష్టి మరల్చేందుకు 45రోజులపాటు సుదీర్ఘంగా ఈ ఆటలపోటీల పేరుతో వారిని పూర్తిగా పక్కదోవ పట్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జనవరిలో జాబ్ కేలండర్ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ పోస్టులనీన తక్షణమే యుద్ధప్రాతిపదికన భర్తీఇ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఏజెన్సీలో బ్యాక్‌లాగ్ పోస్టులు, ఉద్యోగాల భర్తీకి ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సిని వెంటనే ప్రకటించాలన్నారు. ఆడుదాం ఆంధ్రా అంటూ గిరిజన యువత భవిష్యత్‌తో ఆటలాడుకుంటే, సిఎం జగన్‌కు, వైసిపి ప్రభుత్వానికి పుట్టగతులుండవని హెచ్చరించారు. ప్రజాధనం వృథా చేసి, నిరుద్యోగ యువతకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చని ఆటలతో మభ్యపెట్టాలనుకోవడం మానుకోవాలన్నారు. అధికార పార్టీ నేతలకు, అనుయాయుల జేబులు నింపేందుకు తప్ప ఆడుదాం ఆంధ్రాతో యువతకు ఇసుమంతైనా ప్రయోజనం లేదని మండిపడ్డారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సిహెచ్ బలరాం, అప్పారావు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్తిబాబు, అధికారులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం ఏడుగురురాళ్లపల్లిలో ఆదివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సత్తిబాబు, సొసైటీ చైర్మన్ విజయ్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి డి.శ్రీనివాస్, తహశీల్దారు సుబ్బారావు పాల్గొన్నారు.

వెలగపల్లి-కన్నారం రోడ్డు పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : దేవీపట్నం మండలం వెలగపల్లి నుండి లక్ష్మీపురం మీదుగా కన్నారం వరకు రోడ్డు మంజూరై నాలుగు సంవత్సరాలైనా నేటికీ పనులు మొదలు పెట్టకుండా ఇంజనీరింగ్ అధికారులు జాప్యం చేస్తున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆర్‌సిపిఐ నాయకులు జిత్తుక కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో వెలగపల్లి, గుంపెనపల్లి, లక్ష్మీపురం, కొండపల్లి గ్రామస్తులు అనారోగ్యం పాలైతే ఆస్పత్రికి కూడా వెళ్లడానికి వీల్లేక మరణాలకు కూడా గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం వేరే ప్రాంతానికి వెళ్లడానికి కూడా సరైన సౌకర్యం లేక ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రంపచోడవరం ఏడు మండలాలకు పేరుకు మాత్రమే ఐటీడీఏ అధికారులు ఉన్నారని, గిరిజనులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ఈ ప్రాంత సమస్యల పట్ల ఐటిడిఏ పిఒకి కనీస అవగాహన లేకపోవడం దురదృష్టకరమని కుమార్ ధ్వజమెత్తారు. తక్షణమే వెలగపల్లి-కన్నారం రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కల్తీ మద్యం మరణాలు ప్రభుత్వ హత్యలే

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కల్తీ మద్యం మరణాలను ప్రభుత్వం చేసే హత్యలుగానే గుర్తించాలని జనసేన ఉత్తర నియెజకవర్గం ఇంఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. నల్ల బెలూన్లు, నల్ల దుస్తులు, నల్ల రిబ్బన్లతో, మెడలో కాళీ మద్యం బుడ్డిలతో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం జనసేన ఆధ్వర్యాన నిరసన తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మద్యపాన నిషేధం హామీ నెరవేర్చిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని ప్లకార్డులు పట్టుకుని వారంతా నిరసన తెలియజేశారు. అనంతరం గాల్లోకి నల్ల బెలూన్స్ వదిలి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచకుండా ముఖ్యమంత్రి జగన్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అమ్మఒడికి డబ్బులు వేసి, నాన్న బుడ్డితో డబ్బులు కొట్టేస్తున్నారని ఏద్దేవా చేశారు. తాలి తెంచే మద్యం, జగన్ పాలన మాకొద్దని ఆమె అన్నారు. కార్యక్రమంలో పార్టీ చోడవరం ఇంఛార్జి పివిఎస్‌ఎన్.రాజు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, శాలిని, మహిళా నాయకురాలు తెలుగు లక్ష్మి, డాక్టర్ల అసోసియేషన్ చైర్మన్ బొడ్డేపల్లి రఘు పాల్గొన్నారు.

వాసుపల్లి మినహా వేరొకరికి టిక్కెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసిపి టికెట్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు కాకుండా బిసి సామాజిక తరగతికి చెందిన వేరొకరికి ఇవ్వాలని వైసిపి 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇదే నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు టిడిపి తరపున ఎమ్మెల్యేగా నెగ్గిన వాసుపల్లి గణేష్ కుమార్ నియోజవర్గాన్ని పూర్తిగా విస్మరించారని, పదేళ్ల పదవిలో తన సొంత పనులు చేసుకున్నారు తప్ప నియోజవర్గం ప్రజలను పట్టించుకోలేదని ఆరోపించారు. కార్పొరేటర్లుగా తాము జివిఎంసి ద్వారా సాధించి వార్డులలో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గణేష్ కుమార్ తాను చేసినట్లుగా చెప్పుకుంటున్నారని తెలిపారు.

నిర్బంధం ఆపి, కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే..

వైసిపి ప్రభుత్వ పతనం తప్పదు

కార్మిక, ప్రజాసంఘాలు హెచ్చరిక
విశాఖలో భారీ సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష అభియాన్ కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, వారిపై రాష్ట్ర వైసిపి ప్రభుత్వం నిర్బంధం ఆపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం విశాఖ నగరంలో కార్మిక, ప్రజా సంఘాలు భారీ సంఘీభావ ప్రదర్శన నిర్వహించాయి. సరస్వతీ పార్క్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు జరిగిన ప్రదర్శన అనంతరం సభ నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి అధ్యక్షత వహించారు. సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య మాట్లాడుతూ అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష అభియాన్ కార్మికులు దీర్ఘకాలం తమ సమస్యలపై ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారన్నారు. ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చారన్నారు. వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారని, అయినా ఫలితం లేకపోవడంతో తప్పని స్థితిలో సమ్మెకు దిగారని తెలిపారు. దీనికి రాష్ట్ర వైసిపి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తక్షణమే ఆ సంఘాల రాష్ట్ర నాయకులతో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై నిర్బంధం నిలిపివేయాలని, లేనిపక్షంలో జగన్ ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా సెంటర్ల తాళాలు పగలగొట్టించి వేరే వారితో పని చేయించి ప్రభుత్వం కార్మికులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. దౌర్జన్యం ద్వారా ప్రభుత్వం పాలన సాగిస్తుందా ? అని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశం మేరకు గ్రాడ్యుటీ చెల్లింపు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు.

సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులను అరెస్టులు చేయించి స్టేషన్లలో నిర్బంధిస్తున్నారన్నారు. అక్రమ కేసులు పెడుతున్నారని, నాయకులను గృహ నిర్బంధం చేస్తున్నారని తెలిపారు. ఇతర కార్మికులను ఉసిగొల్పుతున్నారన్నారు. కార్మికులపైనా, ప్రజా ఉద్యమాలపైనా నిర్బంధం ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టలేదని జగన్మోహన్ రెడ్డి గ్రహించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, రెగ్యులరైజేషన్ వంటి ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు బి.పుష్పలత, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి రోహిణి, ఎఐటియుసి జిల్లా నాయకులు పడాల రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ముఠా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు జె.రామకృష్ణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.అనసూయ, తోపుడు బండ్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.మూర్తి, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.హరి, గొడౌన్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎ.నాయుడు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, భారత్ బచావో కన్వీనర్ శ్రీనివాసరావు, హాస్పిటల్స్ యూనియన్ నాయకులు పి.వెంకటరావు పాల్గొన్నారు.

విశాఖకు అమృత్ భారత్ రైలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శనివారం ప్రారంభమైన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒకటైన మాల్దా టౌన్-ఎస్ఎంవి టెర్మినల్ (బెంగళూరు) రైలు స్టార్ట్ రన్‌లో భాగంగా ఆదివారం ఉదయం వాల్తేరు డివిజన్‌లోకి ప్రవేశించింది. మధ్యాహ్నం 1:45 గంటలకు విశాఖపట్నం చేరుకున్న ఆ రైలుకు వాల్తేర్ డివిజన్ రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కూటికుప్పల సూర్యారావు, నగర మేయర్ హరి వెంకట కుమారి, స్థానిక కార్పొరేటర్ కందుల నాగరాజులతో పాటు వాల్తేరు డిఆర్ఎం సౌరవ్ ప్రసాద్, ఇతర అధికారుల బృందం పాల్గొని దేశ ప్రజలకు రైల్వేలు అందిస్తున్న సౌకర్యాలను, సేవలను ప్రశంసించారు.

ఈ రైలు ప్రత్యేకతలు

ఈ రైలు ఎయిర్ కండిషన్ లేని కోచ్‌లతో కూడిన ఎల్‌హెచ్‌బి పుష్ పుల్ విభాగానికి చెందినది. రెండు చివర్లలో రెండు లోకోలను కలిగి ఉంటుంది. ఆకర్షణీయంగా డిజైన్ చేయబడిన సీట్లు, మెరుగైన లగేజీ ర్యాక్, మొబైల్ హోల్డర్‌తో మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, ఎల్ఇడి లైట్లు, సీసీ టివి, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. 22 కోచ్‌లను కలిగి ఉంది. అందులో అన్‌రిజర్వ్ ప్రయాణికుల కోసం 8 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు, 12 సెకండ్ క్లాస్ 3-టైర్ స్లీపర్ కోచ్‌లు, రెండు గార్డు కంపార్ట్‌మెంట్లు కలిగి ఉంది. మొత్తం 1834 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం కలిగి ఉంది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం కలిగినటువంటిది.

ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రముఖులు
7 నుంచి అందుబాటులో రెగ్యులర్ సర్వీస్

రెగ్యులర్ సర్వీసు ఇలా..

13434 మాల్దా టౌన్ - ఎస్‌విఎంటి బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ మాల్దా టౌన్ నుంచి 7 జనవరి 2024 నుంచి ప్రతి ఆదివారం ఉదయం 08.50కి మాల్దా టౌన్‌లో బయలుదేరి మరుసటిరోజు సోమవారం ఉదయం 05.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. మరలా 05.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మంగళవారం ఉదయం 03.00 గంటలకు గమ్యస్థానం ఎస్‌విఎంటి బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు దిశలో 13433 ఎస్‌విఎంటి బెంగళూరు-మాల్దా టౌన్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఎస్‌విఎంటి బెంగళూరు రైలు 09 జనవరి 2024 నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 13.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు బుధవారం ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 10.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు గురువారం ఉదయం 11.00 గంటలకు మాల్దా పట్టణానికి చేరుకుంటుంది. ఈ రైళ్ళు న్యూ ఫరక్కా, రాంపూర్‌హాట్, బోల్పూర్ శాంతినికేతన్, బర్ధమాన్, దంకుని, అందుల్, ఖరగ్‌పూర్, బెల్దా, జలేశ్వర్, బాలాసోర్, సోరో, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి మీదుగా ప్రయాణిస్తాయి.

వారం రోజుల పాటు వంజంగి రావొద్దు

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన వనజంగి కొండ సందర్శనను ఈనెల రెండవ తేదీ నుంచి తొమ్మిదవ తేదీ వరకు వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.కాలుష్యంతో నిండిన వనజంగి పర్యాటక కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, రాళ్ళు, రప్పలు, పొదల తొలగింపు, రహదారి మరమ్మతులు, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం వారం తోజులపాటు వనజంగి సందర్శనను మూసివేస్తున్నట్లు వెల్లడించారు. మన్యంలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు వచ్చే పర్యాటకులు గమనించాలని, ఈ నెల 9వ తేదీ వరకు వనజంగి సందర్శనకు రావద్దని కలెక్టర్ సూచించారు.

2, 3 తేదీల్లో చాపరాయికి నో ఎంట్రీ

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం పరిశుభ్రత, సుందరీకరణ నేపథ్యంలో ఈనెల 2, 3 తేదీల్లో పర్యాటకులకు ప్రవేశాలకు అనుమతి లేదని ఐటిడిఎ టూరిజం కోఆర్డినేటర్, చాపరాయి జలపాతం సూపర్వైజర్ అప్పారావు తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చాపరాయి జలపాతాన్ని ఆకర్షనీయంగా సుందరీకరణ పనులు చేపట్టి, త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో జలపాతం మొత్తాన్ని శుభ్రం చేయడానికి రెండు రోజులు పడుతుందన్నారు. దీంతో రెండు రోజులుగా పర్యాటకులకు ప్రవేశ అనుమతి లేదన్న విషయాన్ని సందర్శకులు గమనించాలని కోరారు.

కంబాలకొండలో 'గీతం' ట్రెక్కింగ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : పర్యాటక ప్రాంతాలను ముఖ్యంగా అభయారణ్యాలను పరిరక్షించుకోవాలనే నినాదంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఆదివారం కంబాలకొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ నిర్వహించారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గోపీనాథ్ ఆధ్వర్యాన 50మంది వలంటీర్లు ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. అభయారణ్యాలలో జీవజాతుల ను కాలుష్యం నుంచి కాపాడుకోవాలని, పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయరాదని ఈ సందర్భంగా విద్యార్థులు బ్యానర్లను ప్రదర్శించారు. అటవీశాఖ అధికారి శివప్రసాద్ ఇకో టూరిజం ప్రాధాన్యతను, కంబాలకొండ అభయారణ్యం విశేషాలను వలంటీర్లకు వివరించారు. యువతలో సామాజిక బాధ్యతను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియజెప్పడానికి ఈ తరహ ట్రెక్కింగ్‌లను మరింతగా నిర్వహిస్తామని గీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.గోపీనాథ్ తెలిపారు. కంబాలకొండ అభయారణ్యంలో విద్యార్థులకు మార్గదర్శకం వహించిన అటవీశాఖ అధికారులను అభినందించారు.

3న అమరావతిలో సర్పంచుల సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : అమరావతిలో ఈ నెల 3న సర్పంచుల సమావేశం నిర్వహిస్తునట్లు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి తెలిపారు. ఆనందపురంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సర్పంచుల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సర్పంచులందరూ హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం పూర్వ అధ్యక్షులు ముత్యాలరావు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రిలో కూర్చునే సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి-వేపగుంట : రైల్వే డివిజన్ ఆసుపత్రి ఓపీ, పాస్ సెక్షన్ల వద్ద కూర్చునే సదుపాయం కల్పించాలని కోరుతూ రిటైర్డ్ ఉద్యోగులు తీర్మానం చేశారు. సింహాచలం శ్రీనివాసనగర్‌లో బంగారుతల్లి వృద్ధాశ్రమం పక్కన మామిడితోటలో ఆదివారం రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల అసోసియేషన్ మొదటి సార్వత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యదర్శి జివి.రమణ కార్యదర్శి నివేదికను సమర్పించారు. సంఘం స్థాపించిన ఈ సంవత్సర కాలంలో 150 మంది సభ్యులుగా చేరారని తెలిపారు. నూతన సంవత్సరాంతానికి సుమారు 1000 మందిని సభ్యులుగా చేర్చేందుకు సభ్యులందరూ కృషిచేయాలని కోరారు. ప్రతి సభ్యుని సమస్యనూ తమ సమస్యగా భావించినప్పుడే సంఘం పటిష్టంగా ముందుకెళ్తుందన్నారు. కార్యదర్శి నివేదికను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. రైల్వే డివిజన్ ఆసుపత్రి ఓపీ, పాస్ సెక్షన్‌కు రోజుకు సుమారు 35 నుంచి 50 మంది వరకు రిటైర్డ్ ఉద్యోగులు వస్తున్నారని, వారికి ఈ రెండు చోట్లా కూర్చునే సదుపాయం కల్పించాలన్న తీర్మానాన్ని ఆమోదించారు. ఈ విషయాన్ని డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కోశాధికారి ఎస్ఆర్‌కె.రాజు అకౌంట్స్‌ను సభ ముందు పెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.


సాయం అందిస్తున్న ప్రతినిధులు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన పైదా సీతమ్మ, ఆమె కుమార్తె వెంకమ్మ నివాసం ఉంటున్న తాటాకుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురైన శనివారం కాలిబూడిద కాగా, ఆ నిరుపేద కుటుంబానికి పలువురు అండగా నిలిచారు. స్థానిక న్యాయవాది మడివి రవితేజ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సాయంగా రూ.1000 నగదు, దుస్తులు అందించారు. అల్లూరి జిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ వెంకటేష సిబ్బంది చేతుల మీదుగా రూ.5000 నగుదు, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి యువకులు కన్నయ్య, సీపీఎం నాయకులు కర్నాటి శ్రీనివాసరావు, బాబురావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాధవి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి- కొయ్యూరు : అరకు ఎంపీ గొడ్డేటి మాధవి 2024 కొత్త సంవత్సరం సందర్భంగా అరకు పార్లమెంట్ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని ప్రాంతాలు, అన్ని సామాజిక వర్గాల సుస్థిరమైన అభివృద్ధి పథంలో ప్రయాణించేలా కృషి చేస్తున్న జగన్ ప్రభుత్వానికి మరో మారు ప్రజలు పట్టం కట్టాలని కోరారు.

2 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని స్థానిక పశు వైద్యాధికారి సీహెచ్ తరుణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2 నుండి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద మండలంలోని 11వేల పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పశువులకు నోటి నుండి తీగ మాదిరి చొంగ కారడం, నోటి మధ్య పుండ్లు, కాలి గిట్టల మధ్య పుండ్లు లక్షణాలతో నీరసించి మృతి చెందే ప్రమాదం ఉన్న నేపథ్యంలో నాలుగు నెలల దాటిన పశువులకు తప్పనిసరిగా ఈ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని ఆర్.కొత్తూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన కుశిరెడ్డి శ్రీను అనే వ్యక్తి ట్రాక్టర్‌తో వరి చేను నూర్పిడి చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

పార్వతీనగర్ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి పార్వతీ నగర్ పివిటిజి గ్రామ అభివృద్ధికి ఏపీజెన్కో అధికారులు సహకరించాలని టిడిపి అరుగు పార్లమెంట్ అధికార ప్రతినిధి నక్క హరిహర తిరుమలరావు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అధికారులు మంజూరు చేసిన సిసి రోడ్డు, పథకం ద్వారా మంచినీటి సౌకర్యం కల్పనకు పనులు చేపట్టడానికి అధికారులు తోడ్పాటు అందించాలని కోరారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మిస్తామని ఆ ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టవద్దని ఏపీ జెన్కో అధికారులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు.